అలంపూర్ క్షేత్రంలో అఘోరీ

భక్తులను ఆశీర్వదిస్తున్న నాగసాధు అఘోరీ

అలంపూర్, అక్టోబర్ 8 : శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని జోగుళాంబ గద్వాల జిల్లాలోని ఐదో శక్తిపీఠమైన అలంపూర్ ఆలయాలను నాగసాధు అఘోరీ దర్శించుకున్నది. మంగళవారం జోగుళాంబ దేవి, బాలబ్రహ్మేశ్వరస్వామికి పూజలు చేశారు. ఆలయ ధర్మకర్తలతో కలిసి హోమం చేసి భక్తులను ఆశీర్వదించారు.

పాదరక్షలు వదిలి బతుకమ్మకు పూజలు

పాదరక్షలను వదిలి బతుకమ్మకు పూజలు చేస్తున్న మున్సిపల్ చైర్మన్

మహబూబ్‌నగర్/పాలమూరు, అక్టోబర్ 8 : మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని బాలుర జూనియర్ కళాశాల మైదానంలో సోమవారం బతుకమ్మకు పూజలు చేసే క్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు చెప్పులు, షూస్ వేసుకొని అవమానించారు. ఈ విషయాన్ని 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో 'కాంగ్రెస్ ప్రభుత్వంలో బతుకమ్మకు అవమానం' కథనాన్ని ప్రచురించింది. దీంతో స్పందించిన మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్, ఇతర అధికారులు మంగళవారం జిల్లా కేంద్రం లోని బాలుర జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో పాదరక్షలు వదిలి ప్రత్యేక పూజలు చేశారు.

బ్యాంక్ అధికారుల నిర్లక్ష్యం

- విద్యుత్ ఉద్యోగుల ఖాతాల్లో అడ్వాన్స్‌గా 3 నెలల వేతనం
- విత్‌డ్రా చేసుకున్న ఉద్యోగులు
- రికవరీ చేసేందుకు బ్యాంకర్ల తిప్పలు

నాగర్‌కర్నూల్, అక్టోబర్ 8 : నాగర్‌కర్నూల్‌లో ఎస్‌బీఐ అధికారుల నిర్లక్ష్యంతో విద్యుత్ ఉద్యోగుల ఖాతాల్లో అడ్వాన్స్‌గా మూడు నెలల వేతనం జమైంది. ఉద్యోగుల ఖాతాల్లో రూ.4.5 కోట్లు జమ చేయాల్సిన అధికారులు రూ.14.55 కోట్లను జమ చేశారు. ఈ సంఘటన గత ఐదు రోజుల కిందట జరిగగా ఆలస్యంగా తేరుతున్న బ్యాంకు అధికారులు వాటిని రికవరీ చేసేందుకు ముప్పుతిప్పలు పడుతున్నారు. జిల్లాలోని విద్యుత్‌శాఖలో 506 మంది ఉద్యోగుల నెలసరి వేతనాల చెల్లింపుల కోసం సదరు శాఖ ఉన్నతాధికారులు రెండు చెక్కులు రూ.1.85 కోట్లు, మరో చెక్కు రూ.3 కోట్లతో మొత్తం రూ.4.85 కోట్ల చెక్కులను ఉద్యోగుల వేతనాల కోసం సిద్ధం చేశారు. తర్వాత వారి జాబితాతోపాటు ఖాతా నెంబర్లను జిల్లా కేంద్రంలోని మెయిన్‌రోడ్డులో ఉన్న ఎస్‌బీఐ బ్రాంచ్‌లో అప్పగించారు. స్థానిక క్యాషియర్ తోపాటు ఉన్నతాధికారుల నిర్లక్ష్యం కారణంగా ఒక్కో ఉద్యోగికి మూడు నెలల వేతనం జమ చేశారు. బ్యాంకు లావాదేవీల్లో వ్యత్యాసాలు రావడంతో విషయం బయటకు పొక్కింది. ఈ విషయంలో విద్యుత్ అధికారులతోపాటు బ్యాంక్ అధికారులు వేర్వేరుగా ఆర్‌బీఐకి సమాచారం అందజేశారు. దీంతో అదనంగా వేతనాలు పడిన ఖాతాలను నిలిపివేసినప్పటికీ చాలా మంది ఉద్యోగులు అప్పటికే డబ్బులు డ్రా చేసుకున్నారు. మరికొందరు ఎందుకు ఇన్నిడబ్బులు పడ్డాయనే అనుమానం వచ్చినప్పటికీ విత్‌డ్రా చేసుకున్నట్లు తెలుస్తోంది. దీంతో డ్రా చేసుకున్న వారి నుంచి డబ్బులు రికవరీ చేసేందుకు బ్యాంకు అధికారులు ముప్పుతిప్పలు పడుతున్నారు. ఇంకా రూ.6 లక్షలకుపైగా డ్రా చేసుకున్న విద్యుత్ ఉద్యోగుల నుంచి రికవరీ చేయాల్సి ఉన్నట్లు తెలిసింది. ఈ విషయమై మేనేజర్ మధుసూదన్‌రావును వివరణ కోరగా సాంకేతిక సమస్యతో ఇలా జరిగిందని, డ్రా చేసుకున్న వారితోనూ డబ్బులు రికవరీ చేస్తామని తెలిపారు.

గుర్తుతెలియని వృద్ధురాలు మృతి

లింగాల, అక్టోబర్ 8 : మండల కేంద్రంలో మంగళవారం గుర్తుతెలియని వృద్ధురాలు మృతి చెందిన ఘటన చోటు చేసుకున్నది. ఎస్సై వివరాల మేరకు.. మండల కేంద్రంలో ఏక లవ్య చౌరస్తా వద్ద ఓ వృద్ధురాలు(60) మంగళవారం నడుస్తూ రహదారి పక్కన సొమ్మసిల్లి పడిపోయి మృతి చెందిందన్నారు. వృద్ధురాలు ఎవ్వరు అనేది తెలియరాలేదు. విషయం తెలుసుకున్న పోలీసులు, పంచాయతీ సిబ్బంది మృతదేహాన్ని అచ్చంపేట ప్రభుత్వ దవాఖానకు మార్చురీకి తరలించారు.

ధాన్యం సేకరణకు పక్కాగా ఏర్పాట్లు

- కలెక్టర్ విజయేందిరబోయి

మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిరబోయి

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, అక్టోబర్ 8 : వానాకాలం 2024-25 సీజన్‌కు జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా రైతులు ఇబ్బంది పడకుండా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ విజయేందిరబోయి అధికారులకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ధాన్యం కొనుగోలుపై సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో 1,92,646 ఎకరాల్లో వరి పంట సాగైనందునా మొత్తం 4,48,082 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చే అవకాశం ఉందన్నారు. ధాన్యం కొనుగోలుకు జిల్లాలో మొత్తం 189 కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. గ్రేడ్-ఏ రకం ధాన్యం క్వింటాల్‌కు రూ.2,320, సాధారణ రకం రూ.2,300లు, సన్నరకం ధాన్యానికి అదనంగా రూ.500ల బోనస్ చెల్లించి కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. 17శాతం తేమ మించకుండా నిర్ణీత నాణ్యతా ప్రమాణాలు ప్రకారం ధాన్యం తీసుకువచ్చేలా రైతులకు వ్యవసాయ అధికారులు అవగాహన కల్పించాలని సూచించారు. అదనపు కలెక్టర్ ఎస్.మోహన్‌రావు మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే సకాలంలో ట్యాబ్‌లో ఎంట్రీ చేయించి 48గంటల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమచేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ట్యాగ్ చేసిన మిల్లుకు మాత్రమే ధాన్యం పంపాలన్నారు. సమావేశంలో డీఆర్‌డీఏ నర్సింహులు, డీఎస్‌వో వెంకటేశ్, డీఎం విక్రమ్, వ్యవసాయ శాఖ అధికారి వెంకటేశ్వర్లు, జిల్లా సహకార అధికారి శంకరాచారి, మార్కెటింగ్ అధికారిణి బాలామణి సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

210 మంది ఉపాధ్యాయుల ఎంపిక

నాగర్‌కర్నూల్, అక్టోబర్ 8: నాగర్‌కర్నూల్ జిల్లా నుంచి 210 మంది ఉపాధ్యాయులు ఎంపికయ్యారు. ఈమేరకు ఎంపికైన ఉపాధ్యాయులకు హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలను అందజేయనున్నట్లు జిల్లా కలెక్టర్ సంతోష్ తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో డీఎస్సీ 2024 నందు వివిధ కేటగిరిల యందు నోటిఫై చేసిన 231 పోస్టులకు గాను 210 మంది అభ్యర్థులను ఫైనల్ సెలక్షన్ యందు ఎంపిక చేయడం జరిగిందని కలెక్టర్ వెల్లడించారు. డీఎస్సీ ద్వారా ఎంపికైన అభ్యర్థుల వివరాలను డీఈవో నాగర్‌కర్నూల్ అధికారిక వెబ్‌సైట్ ఉంచడం జరిగిందని తెలిపారు. వారందరూ బుధవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేత ఉద్యోగ నియామక పత్రాలు అందుకోవడానికి లాల్ బహదూర్ స్టేడియం హైదరాబాద్ వెళ్ళాల్సి ఉంటుందని, బుధవారం ఉదయం 7 గంటలకు నాగర్‌కర్నూల్‌లోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల నందు సంబంధిత లైసెన్ ఆఫీసర్లకు మూడు పాస్‌ఫోటో సైజు ఫొటోలతో విద్యాశాఖ అధికారులకు రిపోర్టు చేయాలని కలెక్టర్ కోరారు. ఉపాధ్యాయులను హైదరాబాద్ తీసుకువెళ్ళేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, రవాణా సదుపాయాలపై డీఈవోను కలెక్టర్ ఆదేశించారు.భ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఎంపికై ఉపాధ్యాయులు సకాలంలో చేరుకోవాలని కలెక్టర్ సూచించారు.

10న తాలూకాస్థాయి కబడ్డీ పోటీలు

పెద్దకొత్తపల్లి, అక్టోబర్ 8 : మండలంలోని సాతాపూర్‌లో ఈనెల 10వ తేదీన తాలూకా స్థాయి కబడ్డీ పోటీలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు శివ, రాజేశ్వర్‌రావు తెలిపారు. ఆసక్తిగల కబడ్డీ ప్లేయర్స్ సాతాపూర్‌లో సంప్రదించాలని కోరారు. గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు.

మాకు న్యాయం చేయండి

- నారాయణపేట డీఈవో కార్యాలయం ఎదుట డీఎస్సీ అభ్యర్థుల ఆందోళన

నారాయణపేటలో ఆందోళన చేస్తున్న అభ్యర్థులు

నారాయణపేటరూరల్, అక్టోబర్ 8 : ఉపాధ్యాయ ఉద్యోగ నియామకాల్లో తమకు న్యాయం చేయాలని డీఎస్సీ అభ్యర్థులు డిమాండ్ చేశారు. మంగళవారం నారాయణపేట జిల్లా కేంద్రంలోని డీఈవో కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా అభ్యర్థులు మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా వెరిఫికేషన్ ప్రక్రియలో తప్పులు సృష్టించి అన్యాయం చేశారన్నారు. 1:3లో తన కంటే ముందున్న అభ్యర్థి వెరిఫికేషన్‌కు హాజరు కాలేదని, ఆయనను డిస్‌క్వాలిఫై చేయకుండా పెండింగ్‌లో చూపడంతో తనకు ఉద్యోగం రాలేదని ఓ మహిళా అభ్యర్థి ఆవేదన వ్యక్తం చేశారు. ఒకరికి గణితం, ఫిజికల్‌సైన్స్ సబ్జెక్టులలో రెండు ఉద్యోగాలు రాగా తన విల్లింగ్‌లెటర్ లేకుండానే తనకు సబ్జెక్టును కేటాయించడం ఏమిటని మరొక అభ్యర్థి అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆందోళన విషయాన్ని తెలుసుకున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు అక్కడకు చేరుకొని మద్దతు ప్రకటించారు. డీఎస్సీ సెలక్షన్ లిస్ట్‌లో దాదాపు 15 మంది అభ్యర్థులకు అన్యాయం జరిగినట్లు సమాచారం. అవినీతి, అక్రమాలకు పాల్పడిన డీఈవోను సస్పెండ్ చేయాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి డిమాండ్ చేశారు. పేట సీఐ శివశంకర్ ఆందోళన వద్దకు చేరుకొని సముదాయించారు. ఈ విషయంపై డీఈవోను వివరణ కోసం ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

అదృశ్యమైన వ్యక్తికోసం డ్రోన్‌లతో గాలింపు

లింగాల, అక్టోబర్ 8 : మండలంలోని ఎర్రపెంట చెందిన చెంచువ్యక్తి నిమ్మల శంకర్ గత 12రోజుల క్రితం నల్లమల ప్రాంతంలో అదృశ్యమైన ఘటన విధితమే. కాగా అప్పటినుంచి చెంచులు తమవ్యక్తి గురించి గాలింపు నిర్విహిస్తున్నారు. కానీ ఆచూకీలభ్యం కావడం లేదు. మంగళవారం అధికార యంత్రాంగం కదిలివచ్చి పోలీసులు, అటవీశాఖ సిబ్బంది, చెంచులతో కలిసి బృందాలుగా విడిపోయి డ్రోన్‌ల సహాయంతో చీకటి పడేవరకు గాలింపులు కొనసాగించినప్పటికీ అదృశ్యమైన వ్యక్తి అచూకీ లభించలేదు. దీంతో చీకటి పడడంతో అధికారులు తమ ప్రయత్నాన్ని నిలుపుదల చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

మహబూబ్‌నగర్, అక్టోబర్ 8 : రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం జిల్లా కేంద్రంలో చోటుచేసుకున్నది. రైల్వే ఎస్సై సయ్యద్ అక్బర్‌పాషా కథనం ప్రకారం.. జిల్లా కేంద్రంలోని అప్పన్నపల్లికి చెందిన ఈడిగి పెంటయ్యగౌడ్(38)కు కంటిచూపు సరిగాలేని కారణంగా ఏ పనీ చేయలేక జీవితంపై విరక్తి చెంది రైలుకిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రభుత్వ జనరల్ దవాఖానకు తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఫార్మా కంపెనీ రద్దుకు నేడు పాదయాత్ర

కోస్గి, అక్టోబర్ 8 : ఫార్మా కంపెనీని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కోస్గి మండలంలోని పోలేపల్లి నుంచి నిర్వహించే పాదయాత్రను విజయవంతం చేయాలని గ్రం థాలయ సంస్థ మాజీ చైర్మన్ శాసం రామకృష్ణ బీఆర్ఎస్ నేత వెంకట్‌నర్సింహులు పి లుపునిచ్చారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. ఫార్మా కంపెనీ కోసం వికారాబాద్ జిల్లా దుద్యాల్ మండలంలోని లగచర్ల, హకీంపేట్, పోలేపల్లి, పులిచర్లకుంటతండా, ఈర్లపల్లి తండా, రోటిబండతండా గ్రామాల్లోని 3వేల ఎకరాలను కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకోవడాన్ని నిరసిస్తూ రైతులు నిరాహార దీక్షలు చేస్తున్నా ప్ర భుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ప్ర భుత్వ తీరును నిరసిస్తూ మాజీ మంత్రి శ్రీ నివాస్‌గౌడ్, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డితో కలి సి పోలేపల్లి ఆలయం వద్ద పూజలు చేసి పా దయాత్ర ప్రారంభిస్తారన్నారు. పాదయాత్ర కు కొడంగల్ నియోజకవర్గ యువకులు, రైతులు, బీఆర్ఎస్ నాయకులు ఉదయం 7 గంటలకు పోలేపల్లి ఆలయం వద్దకు చేరుకోవాలని కోరారు.

కొట్రలో హైమాస్ట్ లైట్లు ప్రారంభం

హైమాస్ట్ లైట్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి

వెల్లండ, అక్టోబర్ 8 : మండలంలోని కొట్ర గ్రామంలో మంగళవారం హైమాస్ట్ లైట్లను కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.5లక్షలు నిధులతో హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో పీసీబీ మెంబర్ బాలాజీసింగ్, రవీందర్‌రావు, శ్రీను, రవి, అల్లాజీ ఉన్నారు.

వాసవీమాతను దర్శించుకున్న ఎమ్మెల్సీ

నాగర్‌కర్నూల్, అక్టోబర్ 8: నాగర్‌కర్నూల్‌లోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారిని మంగళవారం ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు హరిబాబు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్సీని ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో లయన్ రాధాకృష్ణ, బాల్‌రాం, ప్రసాద్, రాఘేందర్ పాల్గొన్నారు.

మహిళ లకు ప్రభుత్వం పెద్దపీట

కొల్లాపూర్, అక్టోబర్ 8 : కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేస్తున్నట్లు సింగిల్ విండో మాజీ చైర్మన్ జూపల్లి రఘుపతిరావు అన్నారు. మంగళవారం మండలంలోని కుడికిళ్ల గ్రామంలో 500 సిలిండర్ లబ్ధిదారులకు ధ్రువపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. ఆయన వెంట స్థానిక కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

రెండు కార్లు ఢీ : ఇద్దరికి స్వల్ప గాయాలు

మక్తల్, అక్టోబర్ 8 : రెండు కార్లు ఢీకొని ఇద్దరికి గాయాలైన ఘటన బుధవారం పట్టణ సమీపంలోని ట్యాంక్‌బండ్ వద్ద చోటుచేసుకున్నది. ఎస్సై భాగ్యలక్ష్మిరెడ్డి కథనం ప్రకారం.. ఊట్కూరు మండలం బిజ్వార్‌కు చెందిన కొల్లంపల్లి నారాయణ రాయచూరు జిల్లా శక్తినగర్ నుంచి బిజ్వార్‌కు వెళ్తున్నాడు. అలాగే హైదరాబాద్ నుంచి రాయచూరు వెళ్తున్న కారును ఎదురుగా ఢీకొట్టడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. విషయ తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను చికిత్స కోసం మక్తల్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు.

వాణిజ్య

సామ్‌సంగ్ టాప్

న్యూఢిల్లీ, అక్టోబర్ 8: స్మార్ట్‌ఫోన్ల తయారీ సంస్థ సామ్‌సంగ్ మరోసారి సత్తాను చాటింది. ప్రస్తుత పండుగ సీజన్ తొలి విడుతలో కంపెనీ మొబైళ్లకు కొనుగోలుదారుల నుంచి విశేష స్పందన లభించింది. ఈ సీజన్‌లో అమ్ముడైన ఫోన్లలో 20 శాతం మార్కెట్ వాటాతో సామ్‌సంగ్ తొలిస్థానంలో నిలిచిందని టెక్ ఇన్‌సైట్స్ విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. అలాగే సెప్టెంబర్ 26 నుంచి అక్టోబర్ 6 వరకు కేవలం 11 రోజుల్లోనే 10 లక్షలకు పైగా ఐఫోన్లు కొనుగోలు చేశారు. అత్యధికంగా అమ్ముడైన ఫోన్లలో గెలాక్సీ ఎం35, గెలాక్సీ ఎస్23, గెలాక్సీ ఏ14, గెలాక్సీ ఎస్23 ఎఫ్ ఈలు ఉన్నాయి. బిగ్ బిలియన్ డేస్ పేరుతో ఫ్లిప్‌కార్ట్ ప్రత్యేక ఆఫర్లు ప్రకటించగా, అమెజాన్ ఇండియన్ ఫెస్టివల్ పేరుతో ఆఫర్లను తీసుకొచ్చాయి.

టాటా టెక్నాలజీస్‌తో బీఎండబ్ల్యూ జట్టు

ముంబై, అక్టోబర్ 8: టాటా టెక్నాలజీస్, బీఎండబ్ల్యూ గ్రూప్ జట్టు కట్టాయి. మంగళవారం తమ జాయింట్ వెంచర్ (జేవీ)ను అధికారికంగా ప్రకటించాయి. బీఎండబ్ల్యూ టెక్ వర్క్స్ ఇండియా పేరిట ఈ జేవీని తెచ్చారు. సాఫ్ట్‌వేర్ డిఫైన్డ్ వెహికిల్స్ (ఎస్‌డీవీ)సహా ఆటోమోటివ్ సాఫ్ట్‌వేర్, ఐటీ వ్యాపారం కోసం డిజిటల్ ట్రాన్స్‌ఫార్మేషన్ సొల్యూషన్స్‌ను ఇది అభివృద్ధి చేయనున్నది. కాగా, 100 మంది ఉద్యోగులతో ఇది మొదలు కానున్నది. పుణె, బెంగళూరు, చెన్నై ఆధారంగా కార్యకలాపాలు సాగుతాయి.

ఎఫ్‌ఎంసీజీపై పామాయిల్ పిడుగు

న్యూఢిల్లీ, అక్టోబర్ 8: అంతర్జాతీయ మార్కెట్లో భగ్గుమంటున్న పామాయిల్ ధరలు దేశీయ ఎఫ్‌ఎంసీజీ రంగ సంస్థల లాభాలపై తీవ్రస్థాయిలో ప్రభావం చూపనున్నది. సెప్టెంబర్ త్రైమాసికంలో ఆయా సంస్థల లాభాలు భారీగా తగ్గే అవకాశాలున్నాయని సర్వే వెల్లడించింది. ఒకవైపు పామాయిలు ధరలు, మరోవైపు ఉత్పత్తి వ్యయం, ప్రకటనలకోసం అధికంగా నిధులు వెచ్చించడంతో మార్జిన్లు, లాభాలపై ప్రతికూల ప్రభావం పడనున్నది. గోద్రెజ్ కన్జ్యూమర్ ప్రొడక్ట్స్, డాబర్, మారికోలు తమ లాభాలు ఏడాది కనిష్ఠ స్థాయికి పడిపోయే అవకాశాలున్నాయని పేర్కొన్నాయి.

హైదరాబాద్‌లో 'రియల్' డౌన్

19 శాతం తగ్గిన ఇండ్ల అమ్మకాలు దేశీయ ప్రధాన నగరాల్లోనే అత్యధికం

జూలై-సెప్టెంబర్‌లో 11,564 యూనిట్లకే పరిమితం ప్రాప్‌టైగర్ తాజా సర్వేలో వెల్లడి

న్యూఢిల్లీ, అక్టోబర్ 8: రాష్ట్ర రియల్ ఎస్టేట్ మార్కెట్ మందగమనంలోకి జారుకున్నది. హైదరాబాద్‌లో వరుసగా పడిపోతున్న ఇండ్ల అమ్మకాలు దీన్నే సూచిస్తున్నాయి మరి. ఈ ఏడాది జూలై-సెప్టెంబర్ త్రైమాసికంలోనూ గృహ విక్రయాలు నీరసంగానే సాగాయి. ప్రముఖ రియల్ ఎస్టేట్ బ్రోకరేజీ వేదిక ప్రాప్‌టైగర్.కామ్ మంగళవారం దేశీయ రెసిడెన్షియల్ మార్కెట్‌పై 'రియల్ ఇన్‌సైట్' పేరిట విడుదల చేసిన నివేదిక ప్రకారం.. గత నెల సెప్టెంబర్‌తో ముగిసిన 3 నెలల్లో హౌజింగ్ సేల్స్ ఏకంగా 19 శాతం దిగజారాయి. దేశంలోని 7 ప్రధాన నగరాల్లో ఇదే అత్యధికం కావడం గమనార్హం. నిరుడు జూలై-సెప్టెంబర్‌లో 14,191 యూనిట్ల అమ్మకాలు జరిగాయి. ఈ ఏడాది ఇదే సమయంలో 11,564 యూనిట్లకే పరిమితమయ్యాయి.

బయ్యర్లలో తగ్గిన ఆసక్తి

గత ఏడాదిదాకా హైదరాబాద్‌లో పరుగులు పెట్టిన స్థిరాస్తి మార్కెట్.. ఇప్పుడు పడకేసింది. ప్రస్తుతం కొనుగోలుదారుల్లో ఇండ్లను కొనాలన్న ఆసక్తే కనిపించట్లేదని వ్యాపారులు చెప్తున్నారు. మార్కెట్‌లో నెలకొన్న ఇబ్బందికర పరిస్థితులు ఒక కారణమైతే.. రుణ లభ్యత కఠినం కావడం మరో కారణమని వారు అంటున్నారు. కాగా, పరిస్థితులు ఇలాగే సాగితే కేవలం నిర్మాణ రంగమేగాక, దాని అనుబంధ రంగాలూ సంక్షోభంలోకి జారుకుంటాయని ఇండస్ట్రీ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

హైడ్రా ఎఫెక్ట్

రాష్ట్ర రియల్ ఎస్టేట్ రంగంలో హైడ్రా ప్రకంపనల్ని సృష్టిస్తున్నది. హైదరాబాద్‌లో తెచ్చిన హైడ్రా.. ఇతర నగరాల్లోని లావాదేవీలపైనా గట్టి ప్రభావాన్నే చూపుతున్నది. ఇక రాజధానిలోనైతే హైడ్రా దెబ్బకు బయ్యర్లు.. ముఖ్యంగా ఎగువ మధ్యతరగతి వర్గాలు ఇండ్లు, ఫ్లాట్లు, ప్లాట్లు కొనాలనే ఆలోచననే వాయిదా వేసుకుంటున్నారు. దీంతో కొత్త నిర్మాణాలన్నీ ఆగిపోయాయి. ఇప్పటికే పూర్తయిన ఇండ్లనూ కొనే వారు లేకపోవడంతో పెట్టిన పెట్టుబడుల్ని రాబట్టుకోనేందుకు తక్కువ ధరలకు ఇస్తామన్నా ఆదరణే కరువైపోయింది. ఫలితంగా రియల్టర్లు ఆందోళన, ఆవేదన చెందుతున్నారు.

దేశవ్యాప్తంగా..

హైదరాబాద్‌సహా మొత్తం దేశంలోని 8 ప్రధాన నగరాల్లో ప్రాప్‌టైగర్.కామ్ తాజా సర్వే జరిగింది. ఇందులో ఢిల్లీ-ఎన్‌సీఆర్ మినహా మిగతా 7 నగరాల్లోనూ హౌజింగ్ సేల్స్ పతనమైనట్టు స్పష్టమైంది. అయితే టాప్-7 నగరాల్లో హైదరాబాద్‌లోనే అత్యధికంగా ఇండ్ల అమ్మకాలు తగ్గినట్టు తేలింది. కాగా, ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లో 29 శాతం విక్రయాలు పెరిగాయి. గతంతో పోల్చితే 7,800 యూనిట్ల నుంచి 10,098 యూనిట్లకు ఎగిశాయి. కోల్‌కతాలో గరిష్ఠంగా 22 శాతం క్షీణించాయి. 3,607 యూనిట్ల నుంచి 2,796 యూనిట్లకు పడిపోయాయి. ఇక బెంగళూరులో 11 శాతం, అహ్మదాబాద్‌లో 9 శాతం, చెన్నైలో 8 శాతం, పుణెలో 3 శాతం, ముంబైలో 1 శాతం చొప్పున సేల్స్ దిగజారాయి.

బీవైడీ సరికొత్త ఈవీ

సింగిల్ చార్జింగ్‌తో 530 కిలోమీటర్లు..



న్యూఢిల్లీ, అక్టోబర్ 8: చైనాకు చెందిన ఎలక్ట్రిక్ వాహన తయారీ సంస్థ బీవైడీ..దేశీయ మార్కెట్లోకి మరో మాడల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈమ్యాక్స్ 7 రూ.26.9 లక్షల నుంచి రూ.29.9 లక్షల మధ్యలో లభించనున్నది. వీటిలో ఆరుగురు కూర్చోవడానికి వీలుండే మాడల్ ధర రూ.26.90 లక్షలు, ఏడు సీట్ల మాడల్ ధర రూ.27.50 లక్షలు, సూపరియర్ మాడల్ రూ.29.30 లక్షల నుంచి రూ.29.90 లక్షల మధ్యలో లభించనున్నది. దీంట్లో 55.4 కిలోవాట్ల బ్యాటరీ ప్రీమియం మాడల్ సింగిల్ చార్జింగ్‌తో 420 కిలోమీటర్లు ప్రయాణించనుండగా, అలాగే 71.8 కిలోవాట్ల బ్యాటరీ కలిగిన మాడల్ 530 కిలోమీటర్లు ప్రయాణించనున్నది. 10.1 సెకండ్లలో 100 కిలోమీటర్ల వేగాన్ని అందుకోనున్న ఈ కారు గంటకు 180 కిలోమీటర్లు ప్రయాణించనున్నది. ఆటోమేటిక్ క్లైమెట్ కంట్రోల్, వైర్‌లెస్ చార్జర్, ఎయిర్ ప్యూరిఫైర్, మూడు ఎయిర్‌బ్యాగ్‌లు వంటి ఫీచర్స్ ఉన్నాయి. ఈ సందర్భంగా బీవైడీఇండియా హెడ్ రాజీవ్ చౌహాన్ మాట్లాడుతూ..దేశీయంగా ప్రవేశపెట్టిన నూతన ఈవీ పాలసీలో ప్రయోజనాలు పొందడానికి దరఖాస్తు చేసుకునే అవకాశాలు లేవని స్పష్టం చేశారు.

ఈసారి కూడా వడ్డీరేట్లు యథాతథమే!

న్యూఢిల్లీ, అక్టోబర్ 8: ఈసారి కూడా రిజర్వుబ్యాంక్ వడ్డీరేట్లను యథాతథంగా ఉంచే అవకాశాలున్నాయి. దేశవ్యాప్తంగా కూరగాయల ధరలు భగ్గుమంటుండటంతో ఆహార ద్రవ్యోల్బణ సూచీ గరిష్ఠ స్థాయిలోనే నమోదవుతుండటంతో బుధవారం ప్రకటించనున్న తన పరపతి సమీక్షలో వడ్డీరేట్లను యథాతథంగా ఉంచే అవకాశాలున్నాయని ఇండస్ట్రీ వర్గాలు అంచనావేస్తున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసేనాటికి మాత్రం వడ్డీరేట్లను అర శాతం తగ్గించేందుకు ఆస్కారం ఉన్నదని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీ ఎండీ, సీఈవో ధీరజ్ రెల్లి తెలిపారు. వరుసగా పది సమీక్షలో వడ్డీరేట్లను ముట్టుకోకపోవడంతో రెపోరేటు 6.50 శాతం వద్ద కొనసాగుతున్నది. దేశ ఆర్థిక వ్యవస్థ ఆందోళనకరంగా ఉండటం, పశ్చిమ దేశాల్లో యుద్ధమేఘాలు కమ్ముకోవడంతో చమురు ధరలు భారీగా పెరిగే అవకాశం ఉన్నదని, ఈ నేపథ్యంలో వచ్చే రెండు సమీక్షల్లో ప్రస్తుత రేట్లను కొనసాగించే అవకాశాలున్నాయన్నారు. తొలి త్రైమాసికంలో వృద్ధి 7.5 శాతం సాధించింది.

హైదరాబాద్‌లో తైవాన్ ఇండస్ట్రియల్ పార్క్

హైదరాబాద్, అక్టోబర్ 8(నమస్తే తెలంగాణ): హైదరాబాద్ శివార్లో ప్రత్యేకంగా తైవాన్ పరిశ్రమ పరిశ్రమల కోసం ప్రత్యేకంగా ఓ ఇండస్ట్రియల్ పార్క్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దండుమల్కాపూర్‌కు సమీపంలో ఈ పార్క్‌ను ఏర్పాటు చేయాలని నిశ్చయించారు. ఇందుకు సంబంధించి తైవాన్ చాంబర్ ఆఫ్ కామర్స్(టీసీసీ) ఉపాధ్యక్షుడు సైమన్ లీ, టీజీఐఐసీ ఎండీ విష్ణువర్ధన్ రెడ్డి మంగళవారం టీజీఐఐసీ కార్యాలయంలో ద్వైపాక్షిక ఒప్పందంపై సంతకాలు చేశారు. దండుమల్కాపూ